క్లుప్తంగా

నైపుణ్య గణనపై శిక్షణ

సీతంపేట: నైపుణ్య గణనపై సోమవారం స్థానిక వైటీసీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.గీతాంజలి గణన చేయడంపై గ్రామ సచివాలయ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వీవీ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంఎస్ అధ్యక్షురాలిగా వరలక్ష్మి

సీతంపేట: ఎంఎంఎస్ అధ్యక్షురాలుగా కూరంగి వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య మహజన సభలో కార్యదర్శిగా కె.సావిత్రి, కోశాధికారిగా రోజారమణిని సభ్యులు ఎన్నుకున్నారని వెలుగు ఏపీఎం కమలకుమారి తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడిగా విజయ్‌కుమార్

సాలూరు రూరల్: మండలానికి చెందిన ఉపాధ్యాయుడు బి.విజయ్‌కుమార్ యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పార్వతీపురంలో ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికలో యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని అన్నారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

60 మందికి వైద్యసేవలు


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఉష

సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామంలో 104 ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉష సుమారు 60 మంది రోగులకు వైద్య సేవలందించారు. కీళ్ల నొప్పులు, జలుబు, జ్వరం, సుగర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ సూచనల మేరకు అన్ని గ్రామాల్లో 104 సంచార వాహనం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, 104 వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎంఈఓల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: మండల విద్యా శాఖాధికారుల సమస్యలు పరిష్కరించాలని ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని సోమవారం గూగుల్ మీట్‌లో నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓలు వృత్తి పరంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సామల సింహాచలం మాట్లాడుతూ.. ఎంఈఓల జాబ్ చార్ట్ ఉత్తర్వులు సంఖ్య 89 ప్రకారం కాకుండా, ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా అన్ని పనులు ఎంఈఓలు చేయాలని చాలా జిల్లాల్లో డీఈఓలు ఆదేశాలు ఇస్తుండటం వల్ల ఎంఈఓలు పని ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

రేవుల అభివృద్ధి

సీతానగరం: కార్తీక మాసంలో నదీస్నానాలకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తీర గ్రామాల పెద్దలు చర్యలు చేపడుతున్నారు. కార్తీక మాసంలో సీతానగరంలో సువర్ణముఖీ నది ఒడ్డున ఉన్న పంచముఖేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి, లక్ష్మీనృశింహ స్వామి ఆలయాలకు వందలాది మంది భక్తులు వెళ్లి పూజా కార్యక్రమాలు చేస్తుంటారు. భక్తులు వేకువజామున నదిలో స్నానాలు ఆచరించి దైవ దర్శనానికి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో నదిలో స్నానాల రేవును స్థానిక సర్పంచ్ జె.తేరేజమ్మ, ఇన్‌చార్జ్ ఈఓ ఇ.రమేష్ సోమవారం జేసీబీ సాయంతో బాగు చేయించారు.

ఎన్నికల బకాయిలు చెల్లించాలని వినతి

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న వీడియోగ్రాఫర్లకు డబ్బులు చెల్లించాలని ఫోటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, కొనపల అన్నాజీరావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న వీడియోగ్రాఫర్లకు అప్పటి తహసీల్దార్లు కొంత అడ్వాన్స్ సొమ్మును ఇచ్చారని, ఎలక్షన్ ఫండ్ వస్తే మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎలక్షన్ ఫండ్ వచ్చినా ఫొటో, వీడియో గ్రాఫర్లకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా అధికారులు దాటవేసే ధోరణి ప్రదర్శిస్తున్నారని వాపోయారు. తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కోరుతూ పాలకొండ ఆర్డీఓకు, ఐటీడీఏ పీఓ, కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో పలుమార్లు వినతులు అందజేసినా ఇంతవరకు ఫలితం లేకుండా పోయిందన్నారు.

హరహర మహాదేవ..


సీతంపేట: అక్షరబ్రహ్మ దేవాలయంలో క్యూ కట్టిన భక్తులు


పాలకొండ : శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు


పాలకొండ రూరల్: పూజలందుకున్న భీమలింగేశ్వరుడు

పవిత్ర కార్తీకమాసంలో తొలి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు ముక్కంటికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే మడి స్నానాలాచరించి లింగరూపుడికి అభిషేకాలు చేశారు. మహిళా భక్తులు ఆలయాల్లోని నంది విగ్రహాలు, తులసి కోటలు, మర్రి, రావి చెట్ల వద్ద దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.
– సాక్షి నెట్‌వర్క్


వీరఘట్టం: మండల కేంద్రంలోని ఉమా సోమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


వీరఘట్టం: వండువలోని కాశీవిశ్వేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి


గరుగుబిల్లి: గేజబ శివాలయానికి పోటెత్తిన భక్తజనం

'సూపర్ సిక్స్' అమలు చేయాలని డిమాండ్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై కురుపాం ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇస్తానన్న ఉచిత బస్సు, తల్లికి వందనం తదితర పథకాల అమలు ఊసే ఇంతవరకు లేకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల వాగ్దానాలు ఎప్పుడు అమలు చేస్తారా అని రాష్ట్ర ప్రజానీకం ఎదురుచూస్తోందన్నారు. హామీలు అమలు చేయాలని అడిగితే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని చెప్పడం వెనక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఆదాయం ఎంత? మనకు ఉన్న ఆదాయానికి ఇస్తున్న హామీలు అమలు చేయడం సాధ్యమేనా అనే అవగాహన లేదా అని నిలదీశారు. ఇప్పటికైనా ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని కోరారు. అలాగే ప్రతీ ఇంటికి సురక్షిత మంచినీరు అందేలా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీవో జె.ఉమామహేశ్వరికి వినతిపత్రం అందజేశారు.


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని నీలకంఠాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రధాన మలుపుల వద్ద పోలీసులు సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఈ బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎల్విన్‌పేట సీఐ బి.హరి తెలిపారు. వాహనదారులంతా తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మితిమీరిన వేగంతో ప్రయాణించవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న సీఐ హరి

వట్టిగెడ్డ ప్రాజెక్టు పూర్తి చేయండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వట్టిగెడ్డ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసి, రైతులకు సాగునీటిని అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు తోట జీవన్న డిమాండ్ చేశారు. ఇదే విషయమై కురుపాం సచివాలయ ఉద్యోగులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ప్రచార సమయంలో కురుపాం వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, రైతుల సమస్యలను పరిష్కరిస్తామని హామీలిచ్చారని గుర్తు చేశారు. ప్రతీ రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తానని కూడా చెప్పారని, తక్షణమే ఆయన ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అలాగే అన్ని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించి, డబ్బులు వెంటనే వేయాలని విజ్ఞప్తి చేశారు.



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: సైబర్ మోసాలు ఎక్కువగా ప్రస్తుతం జరుగుతున్నాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలని చినమేరంగి సీఐ టి.వి.తిరుపతిరావు సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆయన సోమవారం సందర్శించి, అక్కడి విద్యార్థులకు పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మన బ్యాంకు ఖాతా వివరాలను బ్యాంకు సిబ్బంది ఎప్పుడూ ఫోన్ చేసి అడగరని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు అడిగితే అస్సలు చెప్పవద్దని సూచించారు. వ్యక్తిగత సమాచారం ఇస్తే ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ తిరుపతిరావు

జోరుగా దేవాలయ రోడ్డు నిర్మాణం

భామిని: మండలంలోని బత్తిలి ఏబీ రోడ్డు నుంచి మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పర్యాటక శాఖ ప్రతిపాదనలతో సుమారు రూ.1.2 కోట్లతో మూడు భాగాలుగా రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. వెర్రిగెడ్డకు రోడ్డుకు మధ్య సపోర్టు వాల్ కాంక్రీట్ పనులు సోమవారం చేపట్టారు. పనులను ఐటీడీఏ డీఈఈ కె.సింహాచలం, ఏఈ సత్యనారాయణమూర్తి పర్యవేక్షించారు.


బత్తిలిలో నిర్మిస్తున్న దేవాలయ రోడ్డు

దశుమంతపురంలో డయేరియా..!

వీరఘట్టం: మండల పరిధి దశుమంతపురం గ్రామంలోని బీసీ కాలనీలో డయేరియా ప్రబలినట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి చెందిన దర్రు అప్పలస్వామి వాంతులు, విరేచనాలతో బాధపడుతూ సోమవారం స్థానిక పీహెచ్‌సీలో చేరాడు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు.

పశువులకు మిశ్రమ దాణాతో మేలు

పార్వతీపురంటౌన్: పాడిరైతులు తమ వద్ద ఉన్న పశువులకు మిశ్రమ దాణా ఇవ్వడం వల్ల ఖనిజ లవణాలతో పాటు విటమిన్లు తగిన మోతాదులో అందుతాయని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శివ్వల మన్మథరావు అన్నారు. మండలంలోని వెంకంపేట గ్రామంలో పాడిరైతులకు రాయితీపై దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు 125 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణాను కేటాయించగా.. పార్వతీపురం మండలానికి 23 టన్నుల దాణా వచ్చిందన్నారు. మిశ్రమ దాణాలో మొక్కజొన్నలు, సజ్జలు, రాగులు, ఉలవలు, శనగలు, చెక్కలు, వరి తవుడు, చెరకు మడ్డి, ఖనిజ లవణాలు, విటమిన్లు, ఉప్పు వంటి స్థూల పోషకాలుంటాయని వివరించారు. పచ్చిగడ్డి, ఎండుగడ్డి, దాణాలు కలిపి ఒకేసారి మిశ్రమ దాణాగా పశువులకు మేతగా పెడితే పశువుల జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుందని, పాల ఉత్పత్తి శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా పాడి రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి డా.ఆర్.రమేష్, డా.కె.ప్రసాద్, డా.బి.చక్రధర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సీతానగరం: మండల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టిసారించినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. చినభోగిరి నుంచి అప్పయ్యపేట వరకు ఉన్న రాష్ట్ర రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, చెత్తకుప్పలను సోమవారం జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రహదారి మలుపుల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగా కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మలుపుల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేపట్టడంతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అలాగే రోడ్డు భద్రత నిబంధనలపై, సైబర్ నేరాలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలు తెలియజేయొద్దని సూచించారు. పోక్సో చట్టంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

అర్హుల పేర్లు నమోదు చేయండి

జియ్యమ్మవలస: నైపుణ్య శిక్షణకు అర్హులైన వారిని గుర్తించి, వారి పేర్లు నమోదు చేయాలని డిజిటల్ అసిస్టెంట్ రాంబాబు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణకు అర్హత కలిగిన వారి గుర్తింపు ప్రక్రియపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉండి, నైపుణ్య శిక్షణకు ఆసక్తి ఉన్న వారిని గుర్తించి, వారి పేర్లతో నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు.


సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డిజిటల్ అసిస్టెంట్ రాంబాబు

వాహన తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల పరిధిలోని మూలిగూడ మూడు రోడ్ల జంక్షన్‌లో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ పి.నారాయణరావు తన సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, లైసెన్స్‌లు, వారి వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగంతో ప్రయాణించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని సూచించారు. ఇదిలా ఉండగా, కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు వ్యసనాల బారినపడకుండా చదువుపై దృష్టిసారించాలని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్‌ఐ ఆకాంక్షించారు.


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

నాయకుల విగ్రహాలకు ముసుగు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం):

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం మండల కేంద్రంలోని నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సమక్షంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కలిసి నేతల విగ్రహాలు కనిపించకుండా సోమవారం వస్త్రాలు కప్పారు. అలాగే పలు జంక్షన్ల వద్ద ఏర్పాటు చేసిన నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించారు. ఎన్నికలు పూర్తయినంత వరకు ఈ నిబంధనలు అమలవుతాయని ఎంపీడీవో స్పష్టం చేశారు.

కురుపాంలో రాజకీయ నాయకుడి విగ్రహాన్ని కప్పి ఉంచుతున్న దృశ్యం



● సస్యరక్షణ తప్పనిసరి...



వరి పంటకు ఎర్రకంకి తెగులు ఆశించకుండా ఉండేందుకు సస్యరక్షణ చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ధ్రువ, డాక్టర్ స్రవంతి సూచించారు. మండలంలోని సంత-నర్సిపురం గ్రామంలో వరి పంటకు ఎర్రకంకి తెగులు ఆశించిందని రైతులు తెలియజేయడంతో సోమవారం వీరు గ్రామానికి చేరుకుని పైరును పరిశీలించారు. ఎంటీయూ 1318 రకానికి తెగులు ఆశించినట్లు గుర్తించారు. తెగులు రాకుండా ప్రొఫెనోఫాస్ 2 ఎం.ఎల్, ప్రొపైకానోజోల్ ఎం.ఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తెగులు ఆశిస్తే స్పిరనోమేసిఫిన్ 2 ఎం.ఎల్, నాటివో 80 గ్రాముల మిశ్రమాన్ని పంటలో చల్లాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రత్నకుమారి, వీరఘట్టం ఏఓ జె.సౌజన్య, ఏఈఓ కృష్ణకాంత్, రైతులు పాల్గొన్నారు.
– వీరఘట్టం

నేడు బోడిమెట్ట యాత్ర

వీరఘట్టం: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న అచ్చెపువలస బోడిమెట్ట యాత్ర మంగళవారం నిర్వహించనున్నారు. మండల నలుమూలల నుంచి చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ కొండపైనున్న గోవిందమ్మ పేరంటాలును దర్శించుకుంటారు. త్రేతాయుగంలో శ్రీరాముడు ఈ కొండపై బస చేసినట్లు స్థానికుల నమ్మకం. కొండ పైభాగంలో ఉన్న కొన్ని గుర్తులను రాముని పాదాలుగా గుర్తించి పూజలు చేస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస రహదారి వద్ద ట్రాఫిక్ నిబంధనలపై ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు సోమవారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని తెలిపారు. వాహనదారులంతా వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలన్నింటినీ వెంట తీసుకురావాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దన్నారు.


ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు